# మహావృక్షం!

కేదారయ్య పూర్వీకులందరూ వస్తాదులూ, మహాబలశాలులూనూ, కేదారయ్య తండ్రి సర్వేరాళ్ళు మోచేతితో పగలగొట్టేవాడు. గునపాలతో జడ అల్లేవాడు. కేదారయ్య తాత తాడిచెట్లే పీకేవాడు, కేదారయ్య ముత్తాత ఏనుగుల తొండాలు పుచ్చుకుని గిరాగిరా తిప్పేవాడని ప్రతీతి.

ఏది ఎలా వున్నా, కేదారయ్య కుటుంబం నాలుగైదు తరాలుగా గొప్ప బలశాలులున్న పేరు పొందిన కుటుంబం. కేదారయ్యకి మాత్రం బలప్రదర్శనల మీదా, సాహస కార్యాలమీదా ఆసక్తి లేదు. సహజంగా కులాసా పురుషుడు, హాస్యశీలి. మొక్కల పెంపకంలో అతనికున్న ఆసక్తికి అవధిలేదు. తోట నిండా మామిడి మొక్కలు, జామమొక్కలు, నిమ్మ మొక్కలు, కొబ్బరి మొక్కలు మొదలైన అనేక రకాల మొక్కలు పెంచేవాడు.

ఇండియా నుంచి ఇటు జపాను వరకూ, అటు అమెరికా వరకు గల అనేక రకాల మొక్కలు తెచ్చి తన తోటలో పెంచేవాడు. ఉసిరికాయంత గుమ్మడికాయా, గుమ్మడికాయంత ఉసిరి కాయా కాయించి, ప్రపంచ వ్యవసాయదారుల్లో ప్రథముడిగా నిలిచిన అఖండుడు.

అయితే, ఎంత చేసినా, ఊళ్ళోవాళ్ళకి కేదారయ్య మీద గురిలేదు. కారణం కేదారయ్య వంశం బలవంతులికి ప్రసిద్ధి. కేదారయ్య కూడా తాత ముత్తాతలల్లే అఖండమైన బల ప్రదర్శనలిచ్చి తమ ఊరి ప్రతిష్ట తిరిగి నిలబెట్టాలని వాళ్ళ కోరిక, బల ప్రదర్శనలిమ్మని అతని ప్రాణం తోడెయ్యసాగారు.

"ఆ! ఈడివల్ల ఏమవుద్దిలే! పిక్కబలం చూపించాల్సిందే! ఆళ్ళ నాన్నతోనే పోయింది ఆ వొంశప్రతిష్ట!" అన్నాడు సాంబయ్య తాత.

కేదారయ్యకి ఆవేశం వచ్చింది. 'ఏందే సాంబయ్య తాతా! ఏంది మా నాన్నా మా తాతా గొప్పతనం! నాకుమల్లే రకరకాల మొక్కలు, చెట్లు పెంచి ప్రపంచ ప్రతిష్ట పొందారా?" అని అడిగాడు.

"లేదు లేరా ఎలాగైనా ఆళ్ళది గుండె పుష్టి. మంచి తిండి పుష్టి" అన్నాడు.

కేదారయ్యకి ఒళ్ళు మండిపోయింది. 'వీళ్ళ దుంపతెగ' అనుకున్నాడు.

అనుకుని "ఇదుగో సాంబయ్యతాతా! మా తాత తాడిచెట్లు పీకాడు. అంతేకదా! నేనూ తక్కువ్వాణ్ణి కాదు. మఱ్ఱిచెట్టు పీకుతాను. సరేనా?" అన్నాడు.

ఉలిక్కిపడ్డాడు ఉప్పయ్య "ఏందిరోయ్ కేదీగా! మఱ్ఱిచెట్టా ఉల్లి చెట్టా?" అన్నాడు.

"మఱ్ఱిచెట్టేనెహె!" అన్నాడు కేదారయ్య

చుట్ట పొగ వెనకాల్నించి కళ్ళు చిట్లిస్తూ అన్నాడు సాంబయ్య తాత.

"ఆ! ఇట్టాంటోడే ఎనకటికోడు గూట్లో పక్కేసి పడుకుంటానన్నాట్ట. అంతా ఆశ్చర్యపోయారు. వాడు గూట్లో పక్కవేసి, కింద పడుకున్నాట్ట. అట్టా ఓ కాగితం మీద మఱ్ఱిచెట్టు అని రాసి, దాన్ని గోడకి అంటించి పీకుతాడు".

"సాల్లే నో నీ పరాసికాలు సాంబయ్య తాతా! కొమ్మలూ, ఆకులూ, కాండం ఊడలూ, వేళ్ళూ అన్నీ వున్న మఱ్ఱిచెట్టు పీకుతా!"

"ఏంది గునపాలతోనా?"

"నీ బుద్ధి పోనిచ్చుకున్నావు కాదు. చేతుల్తో, వట్టి చేతుల్తో చైత్రమాసం మొదటి సోమవారం, సాయంత్రం, ఊరి చివర, మఱ్ఱిచెట్టు పీకుతా" అని లేచి వెళ్ళిపోయాడు కేదారయ్య.

ఊరంతా సంతోషించింది. వాడు తలుచుకోవాలే తప్ప, వాడి తాత తండ్రులు గుణం ఎక్కడికి పోతుంది. అనుకున్నారంతా.

రెండు పూటలా రకరకాల విందు భోజనాలతో కేదారయ్యని దిట్టంగా మేపసాగారు. సహజంగానే కండలు తిరిగిన కేదారయ్య, మరింత కండలు పెంచి హాయిగా తన తోటల్లో పనులు చూసుకోసాగాడు. సాధన చెయ్యని కేదారయ్యని చూస్తే సాంబయ్య తాతకు అనుమానంగానే ఉంది.

చైత్రమాసం వచ్చేసింది.



మొదటి సోమవారం సాయంత్రం నాలుగూళ్ళ జనం ఊరి చివర మర్రిచెట్టు చుట్టూ చేరారు. కేదారయ్య మర్రిచెట్టు పీగ్గలడని కొందరు, పీకలేడని కొందరు, పందాలుపై పందాలు కాసుకొంటున్నారు.

ఇంతలో కేదారయ్య వచ్చాడు. కేదారయ్య వెంట నలుగురు మనుష్యులు వచ్చారు. ఒక పెద్ద బల్లను మర్రిచెట్టు మొదట్లో వేశారు. దానిమీద గుడ్డ కప్పి వున్న ఒకవస్తువును పెట్టారు.

కేదారయ్య దట్టీ బిగించాడు.

"ప్రజలారా! చైత్రమాసం, మొదటి సోమవారం, సాయంత్రం ఊరి చివర మర్రిచెట్టు పీకుతానన్నాను సరిగ్గా గుర్తుపెట్టుకోండి. ఇది చైత్రమాసమే. మొదటి సోమవారమే! సాయంత్రమే! ఊరిచివరే! ఇదుగో మర్రిచెట్టు పీకుతున్నాను చూడండి" అన్నాడు.

అంటూ బల్లమీదున్న వస్తువు మీది గుడ్డ తొలగించాడు. అంతా ఆశ్చర్యపోయారు. దిగ్భ్రాంతి చెందారు. ఆ వింత వాళ్ళెప్పుడూ చూడలేదు.

పాపం! కేదారయ్య అమాంతం రెండు చేతుల్తో ఒడిసి పట్టుకుని ఊడలతో వేళ్ళతో సహా వున్న "బోన్‌సాయ్ మర్రిచెట్టు" ని పీకి పారేశాడు.

పాటలు పాడని గ్రామఫోను పువ్వు విస్తుపోయింది తనకన్నా చిన్నదైనా మర్రిచెట్టును చూసి.